సాక్షి
అనంతపురం
శనివారం | 6 | మే | 2023



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి.



టమాట కిలో రూ.6

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.6, కనిష్టంగా రూ.2.50, సరాసరిన రూ.3.50 పలికింది.

గరిష్టం/కనిష్టం
34.7°/21.2°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షపాతం నమోదైంది.

మరింత నాణ్యమైన వైద్యం

- ప్రభుత్వాస్పత్రి బలోపేతానికి చర్యలు
- రూ.300 కోట్లతో ఎంసీహెచ్, సర్జికల్ బ్లాక్ పనులు వేగవంతం
- సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీలో అద్భుతమైన సేవలు కొనసాగిస్తాం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



అనంతపురం సర్వజనాస్పత్రిలో పెయిన్ రిలీఫ్ క్లినిక్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

అనంతపురం క్రైం: అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిని పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. రూ.300 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఎంసీహెచ్, సర్జికల్ బ్లాక్ పనులను వేగవంతం చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, వైద్యవిభాగాధిపతుల విజ్ఞప్తుల మేరకు సౌకర్యాలు మెరుగుపరచి రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా చూస్తామన్నారు. మంత్రి శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తనిఖీ చేశారు. గైనిక్ ఓపీ గదులు, ఐసీయూ, చిన్నపిల్లల వార్డులను పరిశీలించి అక్కడ అందుతున్న సేవలపై రోగులు, వైద్యులతో ఆరా తీసి.. సంతృప్తి వ్యక్తం చేశారు. మెయిన్ ఓటీ సమీపంలో అనస్తీషియా విభాగం నూతనంగా ఏర్పాటు చేసిన పెయిన్ రిలీఫ్ క్లినిక్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ క్లినిక్ ప్రాముఖ్యతను సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, అనస్తీషియా వైద్యులు మంత్రికి వివరించారు. ఆస్పత్రిలో రూ.3.46 కోట్లతో ఏర్పాటు కానున్న బర్న్స్ వార్డును మంత్రి పరిశీలించి, త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, వైద్యులను ఆదేశించారు. బర్న్స్ వార్డు ఆవరణలో ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తదితరులతో కలిసి మంత్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రిని సూపరింటెండెంట్ రఘునందన్ సన్మానించారు. అనంతరం జేఎన్‌టీయూ సమీపంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని క్యాథల్యాబ్‌ను పరిశీలించారు. క్యాథల్యాబ్ సేవల గురించి డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ వివరించారు. మంత్రి వెంట జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఇదే స్ఫూర్తి కొనసాగించండి

సీఎం జగన్ సంకల్పానికి అనుగుణంగా మీరందిస్తున్న వైద్య సేవలపై రోగులు సంతృప్తికరంగా ఉన్నారని, ఇదే స్ఫూర్తి కొనసాగించాలని వివిధ విభాగాధిపతులను మంత్రి విడదల రజిని ఆదేశించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో హెచ్‌ఓడీలతో మంత్రి సమావేశమయ్యారు. డీఎంఈ డాక్టర్ కే సత్యవరప్రసాద్ వివిధ కళాశాలల్లో చేపట్టబోయే సంస్కరణలను వివరించారు. అనంతపురం జీజీహెచ్, సూపర్ స్పెషాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమి మంత్రికి విన్నవించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ రఘునందన్, సూపర్ స్పెషాలిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ సుబ్రమణ్యం, హెచ్‌ఓడీలు రామస్వామి నాయక్, భీమసేనాచార్, సుహాసిని, సురేష్ తదితరులు మాట్లాడుతూ.. సర్వజనాస్పత్రిలో మంచాల కొరత ఉందని, యూనిట్లు పెంచి వైద్య సేవలను విస్తృతం చేయాలని, రేడియాలజీలో డిజిటల్ ఎక్స్‌రే మిషన్, క్యాస్కెట్స్ ఏర్పాటు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రికి విన్నవించారు. డీఎంఈ డాక్టర్ సత్యవరప్రసాద్‌ను ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, సూపరింటెండెంట్ రఘునందన్ సన్మానించారు. సమావేశంలో ఏపీ ఎంఎస్ఐడీసీ వీసీ, ఎండీ మురళీధర్‌రెడ్డి, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ మునిచంద్రారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం, ఆర్ఎంఓ డాక్టర్ వైవీ రావు పాల్గొన్నారు.

సదుపాయాలు మెరుగుపర్చాలి

జిల్లాలోని తాడిపత్రి, కళ్యాణదుర్గం గుంతకల్లు, రాయదుర్గం తదితర ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీల్లో సదుపాయాలు మెరుగుపరచి, రోగులు అక్కడే వైద్యం పొందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ తలారి రంగయ్య మంత్రిని కోరారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో అవయవదానం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. యువతకు ఉపాధి కల్పించడంలో భాగంగా మెడికల్ డివైజెస్ పార్క్‌లు, ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలని కోరారు.

వేర్వేరుగా బడ్జెట్ కేటాయించాలి

ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వేర్వేరుగా బడ్జెట్ కేటాయించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మంత్రి విడదల రజినిని కోరారు. ఎంసీహెచ్, సర్జికల్ బ్లాక్ పనులు వెంటనే ప్రారంభించాలని, 200 పడకల నుంచి ఎంసీహెచ్ బ్లాక్‌ను 600 పడకల సామర్థ్యానికి పెంచాలని, క్యాజువాలిటీ, ఏఎంసీలలో మంచాలు, గదులు పెంచాలని విజ్ఞప్తి చేశారు. సూపర్ స్పెషాలిటీలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ తదితర సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేలా వైద్యులను నియమించాలని కోరారు.



చికిత్స పొందుతున్న చిన్నారిని పలకరిస్తున్న మంత్రి విడదల రజిని

జగన్ పాలన దేశానికే ఆదర్శం

వైద్య రంగంలో సీఎం వైఎస్ జగన్ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని, 'నాడు–నేడు' ద్వారా ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచి నాణ్యమైన వైద్యం అందేలా చూస్తున్నారని మంత్రి విడదల రజిని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ రోగులకు వైద్య సేవలు చేరువ చేసేందుకు 'ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్' ప్రవేశ పెట్టారని, రాష్ట్రంలో నూతనంగా 17 వైద్య కళాశాలలను తీసుకొచ్చి రోగులకు మరింత నాణ్యమైన వైద్యం అందించాలని సీఎం తీసుకున్న నిర్ణయం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తమ ప్రభుత్వం వైద్య ఖాళీలన్నింటినీ భర్తీ చేస్తోందన్నారు. లంచాలకు ఆస్కారం లేకుండా.. ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్న సీఎం ఆశయానికి అనుగుణంగా అనంతపురం జీజీహెచ్‌లో సేవలందుతున్నాయన్నారు. చంద్రబాబు పాలనలో వైద్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఆదర్శ పాలన అందిస్తున్న జగన్‌ను విమర్శించడమే టీడీపీ నేతలు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.



ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంతతో కలిసి ఆస్పత్రిలో పర్యటిస్తున్న మంత్రి రజిని

న్యూస్‌రీల్

ఎల్‌డీఎం నాగరాజారెడ్డి బదిలీ

- నూతన ఎల్‌డీఎంగా సత్యరాజ్



బి.నాగరాజారెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ మేనేజర్ (ఎల్‌డీఎం) బి.నాగరాజారెడ్డి బెంగళూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు కెనరాబ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏడాది కిందట జిల్లాకు వచ్చిన బి.నాగరాజారెడ్డి పంట రుణాలు, వ్యవసాయ, అనుబంధ రుణాల పంపిణీతో పాటు వార్షిక రుణప్రణాళిక వంద శాతం సాధించడంలో కీలకపాత్ర పోషించారు. నాబార్డు సహకారంతో అన్ని ప్రధాన బ్యాంకులను సమన్వయం చేస్తూ జిల్లా అభివృద్ధికి సమర్థవంతంగా పనిచేశారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో కొద్ది కాలం పాటు రెండు జిల్లాలకు సేవలందించారు. రెండు మూడు రోజుల్లో ఆయన ఇక్కడి నుంచి రిలీవ్ కానున్నట్లు లీడ్ బ్యాంకు వర్గాలు తెలిపాయి. కాగా ఆయన స్థానంలో నూతన ఎల్‌డీఎంగా తమిళనాడు రాష్ట్రం ఊటీ ప్రాంతానికి చెందిన సత్యరాజ్‌ను నియమించినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

కళ్యాణదుర్గంలో కుమ్మేసిన వర్షం

- 21 మండలాల్లో 18.8 మి.మీ సగటు వర్షపాతం నమోదు



కాలువపల్లిలో టమాట తోటలో నిలిచిన వర్షపునీరు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 21 మండలాల్లో 18.8 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ప్రధానంగా కళ్యాణదుర్గంలో 96.4 మి.మీతో వర్షం కుమ్మేసింది. ఇక గుంతకల్లు 68 మి.మీ, బెళుగుప్ప 43.4, గుమ్మఘట్ట 43.4, ఉరవకొండ 42.4, వజ్రకరూరు 39, బొమ్మనహాళ్ 37.2, కణేకల్లు 35, బ్రహ్మసముద్రం 33.2, శెట్టూరు 27.2, కంబదూరు 25.4, రాయదుర్గం 22.4, ఆత్మకూరు 18.2, విడపనకల్లు 14.8, కుందుర్పి 12.2 మి.మీ వర్షం కురిసింది. మిగతా ప్రాంతాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షపాతం నమోదైంది. మే నెల సాధారణం 36.7 మి.మీ కాగా ఇప్పటికే 90.3 మి.మీ నమోదైంది. ఈ వర్షాలకు పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు ప్రవహించగా... చెక్‌డ్యాంలు నిండిపోయాయి.

నమో నారసింహా..



గోవాహనంపై దర్శనమిస్తున్న లక్ష్మీనారసింహుడు

ఉరవకొండ: పెన్నహోబిలం బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం వేకువజామునే లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత నారసింహున్ని గోవాహనం, శేషవాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఉభయదాతలు, ఈఓ విజయ్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీస్వామి, గుండుస్వామి పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ ధర ఖరారు



గోదాములో సిద్ధంగా ఉన్న విత్తన వేరుశనగ బస్తాలు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ పంట సాగుకు వీలుగా రైతులకు పంపిణీ చేసే విత్తన వేరుశనగ ధరలు, రాయితీ ఖరారు చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జె.ధనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. విత్తన వేరుశనగపై 40 శాతం రాయితీ వర్తింపజేశారని పేర్కొన్నారు. కే–6 రకం క్వింటా పూర్తి ధర రూ.9300 కాగా, అందులో రూ.3,720 రాయితీ వర్తిస్తుందని, మిగతా మొత్తం రైతులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 1812 రకం పూర్తి ధర రూ.8,300 కాగా అందులో రూ.3,320 రాయితీ వర్తిస్తుందని, మిగతా మొత్తం రైతులు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. సోమవారం విత్తన శుద్ధి మొదలు పెడుతామని, నెలాఖరులో పంపిణీ చేయడానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

టెన్షన్... టెన్షన్

- నేడు పదో తరగతి ఫలితాలు

రాప్తాడురూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. శనివారం ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదలకానున్నాయి. శుక్రవారం షెడ్యూల్ ప్రకటించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు జరిగిన పరీక్షలు అనంతపురం జిల్లాలో దాదాపు 36 వేలమంది విద్యార్థులు రాశారు. ఇప్పటికే విద్యార్థులు మొత్తం ఎన్ని మార్కులు వస్తాయి.. ఏసబ్జెక్టులో ఎన్నిమార్కులు వస్తాయనే అంచనాలు వేసుకుంటున్నారు. విద్యాశాఖ మంత్రి ఫలితాలు విడుదల చేయగానే అధికారిక వెబ్‌సైట్ www.resuts.bse.ap.gov.inలో ఉంచుతారని జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ తెలిపారు.

50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు



జీలుగ విత్తనాలు

అనంతపురం అగ్రికల్చర్: పచ్చిరొట్ట ఎరువులకు (గ్రీన్‌మెన్యూర్స్) ఉపయోగపడే జీలుగ (ధనించా) విత్తనాలు 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జె.ధనలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటా జీలుగ విత్తనాల పూర్తి ధర రూ.7,950 కాగా అందులో రైతులు తమ వాటా కింద 50 శాతం రూ.3,900 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 10 కిలోల బస్తా రూపంలో వచ్చే జీలుగ విత్తనాలు భూమి విస్తీర్ణాన్ని బట్టి గరిష్టంగా ఐదు బస్తాలు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే జనుము (సన్‌హెంప్), పిల్లిపెసర విత్తన ధరలు, రాయితీలు ప్రకటించారన్నారు. అందులో జనుము క్వింటా రూ.8,400 కాగా రైతు వాటా రూ.4,200 గానూ, పిల్లిపెసర పూర్తి ధర రూ.9,700 కాగా అందులో రైతుల వాటా రూ.4,850 ఖరారు చేశారన్నారు. ఒక్కో రైతుకు గరిష్టంగా ఐదు ప్యాకెట్లు ఇస్తామని తెలిపారు. త్వరలోనే ఆర్‌బీకేల్లో తమ వాటా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుంటే సకాలంలో అందుబాటులోకి తెస్తామని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాల ద్వారా పంటలకు మేలు జరిగేలా భూమిలో సేంద్రియ పోషకాలు బాగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలు ప్రశాంతం

- జిల్లా అధ్యక్షురాలిగా కాపు భారతి రెండోసారి ఎన్నిక



ప్రతిజ్ఞ చేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు

అనంతపురం అర్బన్: రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల అధికారిగా జిల్లా సహకార అధికారి ప్రభాకర్‌రెడ్డి, పరిశీలకులుగా సొసైటీ రాష్ట్ర సభ్యులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ దస్తగిరి వ్యవహరించారు. ముందుగా 13 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యుల స్థానాలకు నామినేషన్లు స్వీకరించారు. ఒక్కో స్థానానికి ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలైంది. పరిశీలన తర్వాత.. అన్నీ సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. పోటీ లేనందున 13 మంది సభ్యులూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి, వారిచేత ఎన్నికల పరిశీలకులు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ సభ్యుల్లో ఒకరైన కాపు భారతిని జిల్లా అధ్యక్షురాలిగా రెండోసారి, డాక్టర్ లక్ష్మణ్‌ప్రసాద్‌ను ఉపాధ్యక్షునిగా, ఎ.మల్లికార్జునను కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే క్రమంలో సొసైటీ రాష్ట్ర సభ్యునిగా కాపు రామచంద్రారెడ్డిని ఎన్నుకున్నారు. ఎనికల నిర్వహణకు ముందు రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు హెన్రీ డునాంట్ చిత్రపటానికి సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఎగ్జిక్యూటివ్ సభ్యులు వీరే...

కాపుభారతి (అధ్యక్షురాలు), డాక్టర్ లక్ష్మణ్ ప్రసాద్ (ఉపాధ్యక్షుడు), ఎ.మల్లికార్జున (కోశాధికారి), కాపు రామచంద్రారెడ్డి, సుబ్రమణ్యం, హరణి, జనార్దన్‌రెడ్డి, హనుమంతరావు, జనార్దన్, మనోరంజన్‌రెడ్డి, పృథ్వి, బద్రీనాథ్, హితేశ్ కుమార్‌జైన్.

సేవే మా కర్తవ్యం

రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులందరమూ సేవను బాధ్యతగా కాకుండా కర్తవ్యంగా భావిస్తామని జిల్లా నూతన అధ్యక్షురాలు కాపు భారతి తెలిపారు. రెండోసారి తనను అధ్యక్షురాలిగా ఎన్నుకున్న సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కరోనా సమయంలో రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున తాము సైనికుల్లా పనిచేసి బాధితులకు వివిధ రూపాల్లో సేవలందించామని, సొంత నిధులు సైతం తాము ఖర్చు చేశామని సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. తమపై విమర్శలు చేసే వారికి నోటితో కాకుండా ప్రజలకు సేవ చేయడం ద్వారా సమాధానమిస్తామన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులందరూ ఆర్మీలా (సైనికుల్లా) సేవ చేస్తామన్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ శుక్రవారం తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రి ఉషశ్రీచరణ్, రెండు జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు కో–ఆప్షన్, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు హాజరవుతారని వివరించారు. గత సమావేశాల్లో చర్చించిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలు, ప్రస్తుతం జరగబోయే సమావేశంలో సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పేలా సమగ్ర నివేదికలతో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

పేదింటి చెల్లెమ్మలకు 'కళ్యాణమస్తు'



లబ్ధిదారులకు మెగాచెక్కును అందజేస్తున్న కలెక్టర్ గౌతమి

- ఆర్థికసాయం విడుదల
- జిల్లాలో 486 మంది లబ్ధిదారులు
- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ.లక్ష
- బీసీలకు రూ.50 వేలు
- దివ్యాంగులకు రూ.1.50 లక్షలు
- భవన, ఇతర నిర్మాణ కార్మికుల పిల్లలకు రూ.40 వేలు

అనంతపురం: పేదింటి చెల్లెమ్మల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. గడిచిన త్రైమాసికం(జనవరి – మార్చి)లో పెళ్లి చేసుకున్న పేదింటి చెల్లెమ్మలకు 'వైఎస్సార్ కళ్యాణమస్తు', 'వైఎస్సార్ షాదీ తోఫా' పథకాల సొమ్ము విడుదలైంది. అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నగదు జమ చేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఎం.గౌతమి కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలోని 486 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ పెళ్లికుమార్తెలకు సంబంధించి వారి తల్లుల ఖాతాల్లో జమచేయనున్న రూ.3,60,70,00 మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా ద్వారా పేద కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల ఆడపిల్లల వివాహానికి సీఎం ఆర్థిక భరోసా కల్పించారన్నారు. ఈ పథకాల ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ.లక్ష, బీసీలకు రూ.50 వేలు, దివ్యాంగులకు రూ.1.50 లక్షలు, రిజిష్టర్ అయిన భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికుల పిల్లలకు రూ.40 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆడపిల్లల తల్లుల ఖాతాలకు, తల్లులు లేకుంటే ఆడపిల్లల ఖాతాలకు నగదును నేరుగా జమ చేస్తోందన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.75 వేలు అందిస్తోందన్నారు. జిల్లాలో ఈ పథకం కింద కులాంతర వివాహాలు 71 మంది, ఒకే కులంలో వివాహం చేసుకున్న వారు 415 మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, ఎమ్మెల్సీ మంగమ్మ, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వమోహన్‌రెడ్డి, డీటీడబ్ల్యూఓ అన్నాదొరై, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి


11 కేవీ వైర్లు తగిలి మృతి చెందిన తిమ్మక్క

కంబదూరు: మండలంలోని రాళ్లపల్లి గ్రామానికి చెందిన తిమ్మక్క (62) అనే వృద్ధురాలు 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి మృత్యువాత పడింది. స్థానికుల వివరాలమేరకు... రాళ్లపల్లి గ్రామంలో శుక్రవారం తెల్లవారు జామున వీచిన గాలులకు గ్రామ సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. అయితే తిమ్మక్క బహిర్భూమికి వెళ్లే సమయంలో తెగిపడిన 11 కేవీ విద్యుత్ వైర్ల గమనించలేదు. తెగిపడిన విద్యుత్ వైర్లు తిమ్మక్కకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని వైస్ ఎంపీపీ భీమేష్, ఉప సర్పంచ్ శ్యామంత్‌రెడ్డి పరిశీలించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

పాముకాటుతో వివాహిత మృతి


మృతురాలు శిల్ప

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన శిల్ప (22) అనే వివాహిత పాముకాటుతో మృతి చెందింది. స్థానికుల వివరాలమేరకు.. శిల్ప గురువారం ఇంటి దగ్గర ఉన్న కట్టెలను తీస్తుండగా కట్టెల్లో ఉన్న విష పురుగు శిల్ప కుడి చేతిపై కాటు వేసింది. వెంటనే బంధువులు గమనించి కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శిల్ప మృతి చెందింది. ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్తతో పాటు ముగ్గురు పిల్లలున్నారు.

చైన్‌స్నాచర్ అరెస్ట్

యల్లనూరు: మండల కేంద్రానికి చెందిన నారాయణమ్మ మెడలోని మూడు తులాల బంగారు గొలుసు ఇటీవలే చైన్‌స్నాచర్ దొంగిలించిన విషయం పాఠకులకు తెలిసిందే. యల్లనూరు, సింహాద్రిపురం, లింగాల పరిధిలో ఒకేరోజు మూడు చైన్ స్నాచింగ్‌లు చేస్తుండగా లింగాలలో శుక్రవారం దొంగను పట్టుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఇటీవల చేసిన దొంగతనాలు తానే చేసినట్లు తాడిపత్రికి చెందిన రాణా ప్రతాప్ ఒప్పుకున్నాడన్నారు. దొంగిలించిన బంగారును స్వాధీనం చేసుకొని రిమాండుకు పంపినట్లు చెప్పారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

- రాప్తాడును అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నాం
- త్వరలోనే మహిళా సహకార డెయిరీని ప్రారంభిస్తాం
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి హాజరైన మహిళలు

ఆత్మకూరు: 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుల, మత, పార్టీలతో సంబంధం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే పథకాల డబ్బును జమ చేశాం. ప్రభుత్వం నుంచే కాకుండా తోపుదుర్తి కుటుంబం ద్వారా ఎన్నో ఉచిత బోర్లు వేశాం. సొంత నిధులతో ఆలయాలకు, మసీదుల అభివృద్ధికి సహకరించాం. మహిళల అభ్యున్నతికి స్థలం కొనుగోలు చేసి డైయిరీ మిషన్లు ఏర్పాటు చేయించాం. తోపుదుర్తి సహకార డైయిరీకి సంబంధించి ట్రయల్‌రన్ కూడా చేశాం. త్వరలోనే డెయిరీని ప్రారంభిస్తాం. అభివృద్ధిని చూసే ఓటు వేయండి' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరులో వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటగా డ్వాక్రా సంఘాల మహిళలతో కలసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

పరిటాల సునీత చేసిన అభివృద్ధి శూన్యం

గత ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన పరిటాల సునీత నియోజకవర్గ అభివృద్ధికి చేసింది ఏమీ లేదని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతుల ఇబ్బందులు తెలుసుకొని ఇచ్చిన మాట ప్రకారమే పేరూరు డ్యాంకు నీరు తెచ్చామని, గత 30 ఏళ్లగా నీరు రాని చెరువులకు నీరు అందజేశామన్నారు. గ్రామాల్లో సమస్యాత్మకంగా ఉన్న విద్యుత్ స్తంభాలకు సొంతంగా రూ.10 లక్షలు వెచ్చించనున్నట్లు తెలిపారు.

హెరిటేజ్‌తో రూ.40 వేల కోట్ల దోపిడీ

రూ. కోట్లతో ఏర్పాటు చేసిన మహిళా సహకార డెయిరీకి సంబంధించి ఇటీవల ట్రయల్ రన్ పూర్తయింది. ముఖ్యమంత్రి జగనన్న చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తున్నామని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. డైయిరీ ద్వారా నియోజకవర్గంలోని 10 వేల మందికి లబ్ధి చేకూరబోతోందన్నారు. హెరిటేజ్ డెయిరీ ద్వారా 25 ఏళ్లలో కేవలం పాల మీదనే మాజీ సీఎం చంద్రబాబు రూ.40 వేల కోట్లను దోచుకున్నారని విమర్శించారు. సహకార డెయిరీలో లీటరు పాలు రూ.45తో కొనుగోలు చేస్తామన్నారు.

లోకేష్‌వన్నీ తప్పుడు మాటలే...

ఎన్నికల లోపు నియోజకవర్గంలో రెండు రిజర్వాయర్లు పూర్తి చేయాలని సీఎం జగనన్న కోరామని ఎమ్మెల్యే తెలిపారు. జాకీ పరిశ్రమ ప్రకాష్‌రెడ్డి వల్లనే పోయిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ తప్పుడు కూతలు కుస్తున్నారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జాకీ పరిశ్రమకు భూములు ఇచ్చారన్నారు. రూ.140 కోట్ల విలువ చేసే 28 ఎకరాల భూమిని కేవలం రూ.2 కోట్లకు ఇచ్చారని చెప్పారు. ఎవడబ్బ సొమ్మని అంత తక్కువకు విక్రయించారని మండిపడ్డారు. బినామీ సంస్థను అడ్డుపెట్టుకొని విలువైన భూమిని కొట్టేశారని విమర్శించారు. ఆ భూమిని తమకు అప్పచెబితే ఆరు నెలల్లో 8 ఎకరాల్లో గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, మిగిలిన 20 ఎకరాలు అమ్మితే తోపుదుర్తి రిజర్వాయర్‌ను కూడా ఉచితంగా నిర్మిస్తామని తెలిపారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

మండలంలో ఎక్కడా నీటి సమస్య ఉన్నా వెంటనే బోర్లు వేయాని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. గతంలో ఎంతోమంది ఎమ్మెల్యేలుగా పనిచేసినా ఆత్మకూరు మండలానికి నీటి సమస్య పరిష్కరించలేకపోయారని, అయితే పీఏబీఆర్ నుంచి ఆత్మకూరు వరకు, అలాగే ఆత్మకూరు నుంచి అనంతపురం రూరల్ పాపంపేట వరకు రూ.93 కోట్లతో పైప్‌లైన్ పనులకు టెండర్లకు ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పార్వతమ్మ, ఎంపీపీలు హేమలత, అంజలి, జెడ్పీటీసీ మారుతీప్రసాద్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ బాలపోతన్న, మండల సచివాలయాల కన్వీనర్ నరసింహారెడ్డి, వాసుదేవ రెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్‌రేట్‌ను పూర్తిగా తగ్గించాలి


గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గార్లదిన్నె: గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు పోలీసు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించే రూము పరిశీలించి, రికార్డులు పరిశీలించారు. స్టేషన్ పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి? మండలంలో సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయా? అని ఎస్ఐ సాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. క్రైమ్‌రేట్ పూర్తిగా తగ్గించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై దృష్టి సారించాలన్నారు. అంతకు ముందు మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి స్వగ్రామమైన ఇల్లూరు, కల్లూరు గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ అస్రార్‌బాషా, ఎస్ఐ సాగర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల: శింగనమల పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. మండలం పరిస్థితులు, కేసుల గురించి సీఐ అస్రార్ బాషా, ఎస్ఐ శ్రీనివాసులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ శివారెడ్డి ఉన్నారు.

వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా పోలీసు పిల్లలకు వేసవి శిక్షణా శిబిరాలను ప్రారంభించినట్లు ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు క్వార్టర్స్ ఆవరణంలోని డీటీసీలో 'అనంత పోలీస్ పిల్లల ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు ఏ రంగంలో రాణిస్తారో ఆ రంగంలో తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. నెల రోజుల పాటు కొనసాగే ఈ శిబిరంలో క్రీడలు, యోగా, ఆర్ట్స్, హ్యాండ్ రైటింగ్, ఎథిక్స్ – మోరల్స్, చెస్ ఆటలపై సుశిక్షితులైన వారితో తర్ఫీదు ఇస్తామన్నారు. అనంతరం సమ్మర్ కోచింగ్ క్యాంపులో పాల్గొన్న పిల్లలకు ఎస్పీ స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగేంద్రుడు, హనుమంతు (ఏ.ఆర్), ఏ.ఆర్ డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అధికారులకు తప్పుడు సమాచారం

- కటకటాల పాలైన యువకుడు


వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

ధర్మవరం: తప్పుడు సమాచారం ఇచ్చి రైలు ఆలస్యంగా నడిచేందుకు కారణమైన ఓ యువకుడు కటకటాల పాలయ్యాడు. స్థానిక రైల్వే జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్మవరం రైల్వే సీఐ నాగరాజు, ఎస్ఐ గోపికుమార్ ఆ వివరాలను వెల్లడించారు. వారి వివరాలమేరకు.. తలుపుల మండలం గొల్లపల్లి తండాకు చెందిన దేవలానాయక్ కుమారుడు తేజేశ్వర్‌నాయక్ ఈనెల 3న కదిరి రైల్వేస్టేషన్‌లో రైలు కదిలే సమయంలో కదిరి నుంచి నల్లచెరువు వెళ్లే రైలు మార్గం డ్యామేజీ అయిందని కదిరి రైల్వేస్టేషన్ మాస్టర్‌కు అజ్ఞాత వ్యక్తిగా ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో రైల్వే అధికారులు రైలును 65 నిమిషాల పాటు ఆపి లైన్ చెక్ చేశారు. అనంతరం ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో రైలు సజావుగా వెళ్లింది. అయితే తప్పుడు సమాచారం ఇచ్చి రైల్వే అధికారుల సమయాన్ని వృథా చేయడమే కాకుండా ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించిన అజ్ఞాత వ్యక్తి ఎవరని దర్యాప్తు చేశారు. దీనిపై కదిరి ఆర్‌పీఎఫ్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. విచారణ అనంతరం తప్పుడు సమాచారం ఇచ్చిన తేజేశ్వర్‌నాయక్‌ను అరెస్టు చేశారు. రైల్వే అధికారులు, ప్రయాణికులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే ఎవరిని ఉపేక్షించబోమని రైల్వే అధికారులు హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌పీఎఫ్ సీఐ బోయకుమార్, కదిరి రైల్వే ఎస్ఐ రహీం, ఏఎస్ఐ శివారెడ్డి, రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్‌బాషా, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

అనంతపురం అగ్రికల్చర్: నగరంలో మిర్చి, పత్తి విత్తన దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తనిఖీ చేశారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్, పాతూరు తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు దుకాణాలను పరిశీలించారు. రైతులకు నిర్ణీత ధర కన్నా అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అంటగడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీ వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

రంగా సాహిత్య పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: రైతుబంధు ఆచార్య ఎన్.జీ.రంగా పేరిట అందించే సాహిత్య పురస్కారాలకు కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు ఆచార్య ఎన్‌జీ రంగ ఫౌండేషన్ అధ్యక్షుడు జెక్కంపూడి సీతారామారావు తెలిపారు. ఎంపికై మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేలు, రెండో విజేతకు రూ.5 వేలు నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఆసక్తి కల్గిన వారు జూన్ 10 లోపు 'డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, 202–శ్రీ వెంకటసాయి రెసిడెన్సీ, రామయ్యనగర్, ఒంగోలు–523002' అన్న చిరునామకు దరఖాస్తులను పంపాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9849799711 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

లీజుకు ఆర్టీసీ స్థలాలు

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలాలు 15 సంవత్సరాల కాల పరిమితితో అద్దెకు ఇవ్వాలని నిర్ణయించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని ఒక ప్రకటనలో తెలిపారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, పామిడి, పెద్దవడుగూరు, యాడికిలో ఖాళీ స్థలాలు ఉన్నాయని వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23లోగా కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు డిప్యూటీ సీటీఎం (కమర్షియల్) రమేష్ (73311 06731)ను సంప్రదించాలని కోరారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

అనంతపురం సెంట్రల్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అనంతపురం అర్బన్‌లో 3, కూడేరులో 5, శింగనమలలో 5, తాడిపత్రిలో 4, ఉరవకొండలో 1, కళ్యాణదుర్గంలో 2, కణేకల్లులో 4, రాయదుర్గంలో 5 చొప్పున మొత్తం 29 అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌లిచ్చారు. శనివారం నుంచి 12వ తేదీలోగా సీడీపీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు సీడీపీఓ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

ట్రాక్టర్ నగర్‌లో నేడు 'కృషి దర్శన్ ఎక్స్‌పో'

గార్లదిన్నె: మండల పరిధిలోని ట్రాక్టర్‌నగర్‌లో శనివారం కృషి దర్శన్ ఎక్స్‌పో– 2023 నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డైరెక్టర్ కమలాబాయి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా కృషి దర్శన్ కార్యక్రమం ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి ఆధునిక యంత్ర పరికరాలు, చిరుధాన్యాల ప్రాసెసింగ్ యంత్రాలను తెప్పించి ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు.

బిల్‌కలెక్టర్ ఆత్మహత్యాయత్నం

యాడికి: పంచాయతీ కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. యాడికి మేజర్ పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి వివరాల మేరకు... బిల్ కలెక్టర్ ఓబులేసు గత కొంత కాలంగా విధులకు సక్రమంగా హాజరుకావడం లేదు. ప్రజల వద్ద నుంచి వసూలు చేసిన పన్ను వివరాలు చెప్పకుండా అలసత్వం వహిస్తున్నారు. శుక్రవారం విధులకు హాజరైన ఓబులేసును సర్పంచు అనూరాధా వసూలు చేసిన బిల్లు వివరాలు అడిగారు. దీంతో మనస్థాపం చెందిన ఓబులేసు సూపర్ వాస్మోల్‌ను అందరి సమక్షంలో తాగాడు. ఓబులేసును వెంటనే యాడికి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారని తెలిపారు.

8 నుంచి సమ్మర్ క్యాంప్

- సద్వినియోగం చేసుకోవాలన్న కలెక్టర్ గౌతమి


పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి జూన్ 11వ వరకు నిర్వహించనున్న సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎమ్.గౌతమి సూచించారు. సమ్మర్ క్యాంప్ పోస్టర్లను కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి, కార్యదర్శి పి.రమ, ఉప గ్రంథాలయ అధికారి వి.సుబ్బరత్నమ్మతో కలిసి విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం గ్రంథాలయ సంస్థ సమ్మర్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. సమ్మర్ క్యాంపు గురించి సంస్థ కార్యదర్శి వివరించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు క్యాంప్ జరుగుతుందని చెప్పారు. పుస్తక పఠనం, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్యాన్స్, తదితర వాటిపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీపీఓ


బీసీ కాలనీలో డ్రైనేజీ కాలువ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న డీపీఓ ప్రభాకర్

పామిడి: పట్టణ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం డీపీఓ ప్రభాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఆప్కాస్ కింద విధులను నిర్వర్తించేందుకు ఆసక్తి ఉన్న పంచాయతీ కాంట్రాక్ట్ కార్మికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక బీసీ కాలనీలో డ్రైనేజీ కాలువ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించి ఎస్టిమేషన్ వేయాలని ఈఓఆర్డీ శశికళకు సూచించారు.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలి

అనంతపురం అర్బన్: కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలని కలెక్టర్ గౌతమి సంబంధిత అధికారులకు, బ్యాంకర్లకు సూచించారు. బీమా పథకాల అంశంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన పథకా లు సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. నాబార్డ్ డీడీఎం అనురాధ, ఏపీజీబీఆర్ఎం మోహన్‌రెడ్డి, కెనరాబ్యాంక్ డీఎం వీరేశ్, డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా పీడీలు నరసింహారెడ్డి, విజయలక్ష్మి, వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీ సీఈఓ భాస్కర్ రెడ్డి, జేడీఏ చంద్రానాయక్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రఘురాములు పాల్గొన్నారు


కదిరిటౌన్: మల్లెపూల ఉత్సవం సందర్భంగా ఖాద్రీశునికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పుట్టెడు దుఃఖంలోనూ నేత్రదానం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగర శివారుల్లోని 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పయ్యావుల శ్రీనివాసులనాయుడు (44) అనే వ్యక్తి మృతి చెందారు. పుట్టెడు దుఃఖంలో ఉన్నా భార్య అరుణ తన భర్త నేత్రదానం చేయాలనుకున్న విషయాన్ని గుర్తుంచుకుని సమాచారాన్ని బంధువుల ద్వారా ఎల్‌వీ ప్రసాద్ హాస్పిటల్ సిబ్బందికి తెలియజేశారు. వైద్యులు.. శ్రీనివాసులు కళ్లను సేకరించారు.

కుమారుడి ప్రోగ్రెస్ రిపోర్టు తెస్తూ...

స్థానిక జన్మభూమినగర్‌లో అరుణ, శ్రీనివాసులునాయుడు దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. శ్రీనివాసులనాయుడు వెల్డింగ్ వర్క్ చేసేవారు. శుక్రవారం కుమారుడికి సంబంధించిన ఏడో తరగతి ప్రోగ్రెస్ కార్డు తీసుకొచ్చేందుకు సీపీఆర్ స్కూల్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. వీఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్టు వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీకొనగా శ్రీనివాసులనాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన కుమారునికి తీవ్ర గాయాలు అయ్యాయి.

మారాల్సింది కమ్యూనిస్టులు కాదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అనంతపురం టవర్‌క్లాక్: 'సోషలిజమే ప్రత్యామ్నాయం.. మారాల్సింది కమ్యూనిస్టులు కాదు... పెట్టుబడి మద్దతుదారులు' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో 'ప్రపంచ ఆర్థిక మాధ్యమం – ప్రజలపై భారాలు' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కమ్యూనిస్టులకు కాలం చెల్లిందని కొందరు అంటున్నారని, కాలం చెల్లింది కమ్యూనిస్టులకు కాదన్నారు. ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో ఉందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు బాలరంగయ్య, ఎస్.ఎం బాషా, చంద్రశేఖర్, గోవందరాజులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రికి తేనీటి విందు



యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్‌తో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

అనంతపురం క్రైం: జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినికి యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్ తేనీటి విందు ఇచ్చారు. జీజీహెచ్, సూపర్ స్పెషాలిటీ తనిఖీ అనంతరం శ్రీనగర్ కాలనీలో గల్లా టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ ఇంటికి మంత్రి వెళ్లారు. వారి కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యకర్తలను మంత్రికి ఆయన పరిచయం చేశారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కనగానపల్లి: మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవికిరణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 11న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు ఈ నెల 9 నుంచి 25వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు రుసుం ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 చెల్లించాలన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ పర్వీన్

రాప్తాడురూరల్: ప్రతి ఒక్కరూ పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ సోమశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'న్యూట్రీషియన్ వీక్ సెలబ్రేషన్' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పోషకాలు లేని, కల్తీ ఆహారాల్ని తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పర్వీన్ , డాక్టర్ జీవీ సుప్రజాచౌదరి, కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, ఏఓ సాయినాథ్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ఆనంద్‌బాబు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పోలీసు జిమ్ పునరుద్ధరణ



జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

అనంతపురంశ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పునరుద్ధరించిన జిమ్‌ను ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులది నిత్యం ఒత్తిడితో కూడిన ఉద్యోగమన్నారు. మనిషి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే తప్పనిసరిగా వ్యాయామం చేయాలన్నారు. అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన జిమ్‌ను సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిమ్‌లో ఏర్పాటు చేసిన ట్రెడ్ మిల్, క్రాస్ ట్రైయినర్ , స్పిన్ బైకు, తదితర పరికరాలను ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ లు రాజశేఖర్ రెడ్డి, రమేష్ నాయక్ , భాస్కర్ , పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్ నాథ్ , సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్ పాల్గొన్నారు.

కార్పస్ ఫండ్ చెక్కుల అందజేత

ఎస్ఐ బి.నరసింహులు, ఏఆర్ కానిస్టేబుల్ సురేష్ వేర్వేరు కారణాలతో ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాలకు ఎస్పీ కె. శ్రీనివాసరావు రూ. 2 లక్షల కార్పస్ ఫండ్ కింద చెక్కులను అందించారు. ఒక్కో కుటుంబానికి రూ.లక్ష అందించారు. అదనపు ఎస్పీ నాగేంద్రుడు, ఏఓ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో ప్లాంటు వద్దు



మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్, గ్రామస్తులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి పంచాయతీ అశ్వర్థ నారాయణస్వామి ఆలయంలో ప్లాంటు ఏర్పాటు చేయొద్దని గ్రామస్తులు మొర పెట్టుకున్నారు. చెక్‌డ్యాం ప్రాజెక్ట్ ఏర్పాటు చేసేందుకు కంపెనీ ప్రతినిధులు శుక్రవారం వచ్చారు. అశ్వర్థనారాయణస్వామి ఆలయ చైర్మన్ ఇరగం యర్రపరెడ్డి, గ్రామపెద్దలు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. ఇక్కడి అశ్వర్థనారాయణస్వామి ఆలయానికి చాలా చరిత్ర ఉందని, తరచూ వివాహాలు, ఏటా ఉరుసు జరుగుతుందన్నారు. ఈ సమయంలో వేలాది మంది భక్తులు పాల్గొంటారన్నారు.

• 'అనుష్క' అదుర్స్

అందని ద్రాక్ష పండ్లు పుల్లన అంటుంటాం.. రైతుకు గిట్టుబాటు ధర, వ్యాపారులకు అందుబాటు ధర ఉండి, ఆశించిన స్థాయిలో దిగుబడి ఉంటే రైతన్నలు 'అదుర్స్' అనక తప్పదు. అనంతపురం రూరల్ మండలం రాప్తాడు సమీపంలో రైతు శివ శంకర్ రెడ్డి సాగు చేసిన 'అనుష్క' ద్రాక్ష పంట విరగ్గాసింది. పేరుకు తగ్గట్టే ద్రాక్ష తోట కూడా నిండుదనంతో కనిపిస్తోంది. ధర కూడా ఆశించిన స్థాయిలో ఉంది. క్వింటా ధర రూ.46 వేలు పలుకుతోంది. ఇక్కడి నుంచి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, యూపీ తదితర ప్రాంతాలకు ద్రాక్ష ఎగుమతి చేస్తున్నట్లు రైతు చెప్పున్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తూ...



ద్రాక్ష పంటను చూపుతున్న రైతు శివశంకర్‌రెడ్డి



ట్రేలలో నింపిన ద్రాక్ష



ద్రాక్ష తీసుకెళ్తున్న మహిళ

మంత్రులకు ఘన స్వాగతం

అనంతపురం టవర్‌క్లాక్ : అనంతపురంలోని అర్‌అండ్‌బీ అతిథిగృహంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషాకు నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి, వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

ఉపముఖ్యమంత్రికి మేయర్ సన్మానం

అనంతపురం క్రైం: ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషాను మేయర్ వసీం సన్మానించారు. శుక్రవారం ఉపముఖ్యమంత్రి అంజద్‌బాషా నీమా ఆప్టికల్ షాపును సందర్శించారు. ఈసందర్భంగా ఉపముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి స్వాగతం పలికారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్ సైపుల్లాబేగ్, నాయకులు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ముతవల్లిలను శాశ్వతంగా తొలగించండి

అనంతపురం సిటీ: అనంతపురంలోని జామియా మస్జీద్ ముతవల్లిలు కేఎం షఫీవుల్లా, ఆయన కుమారుడు కేఎం షకిల్‌షఫీని పదవుల నుంచి శాశ్వతంగా తొలగించాలని ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీమ్ అహమ్మద్‌తో కలిసి జామియా మస్జీద్ జమాత్, పరిరక్షణ సమితి సభ్యులు డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను కోరారు. జామియా మస్జీద్‌లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.



మంత్రి రజినికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, చిత్రంలో కలెక్టర్ గౌతమి

అనంతపురం సిటీ: అనంతపురంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినికి శుక్రవారం ఘన స్వాగతం లభించింది. కర్నూలు జిల్లా పర్యటను ముగించుకొని అనంతపురానికి వచ్చిన ఆమెను ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువ కప్పి సన్మానించారు. కలెక్టర్ ఎం.గౌతమి కూడా మంత్రిని కలిశారు.

అనంతపురం టవర్‌క్లాక్: అనంతపురం రోడ్లు భవనాల అతిథి గృహంలో మంత్రి విడదల రజనీకి అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ బీసీ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు గంగధర్,నాగార్జునరెడ్డి, పురుషోత్తం,రవికుమార్, అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.



డిప్యూటీ సీఎం అంజద్‌బాషావినతి పత్రం అందిస్తున్న నదీం, జామియా మసీదు కమిటీ సభ్యులు

మంత్రికి సమస్యలపై వినతులు

అనంతపురం క్రైం: సమస్యలు పరిష్కరించాలని మంత్రి విడదల రజనీకి ఏపీఎన్‌జీఓ, కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు, ఏఐటీయూసీ నాయకులు విన్నవించారు. శుక్రవారం మంత్రి జీజీహెచ్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తనిఖీ చేసిన సందర్భంగా వారు మంత్రికి సమస్యలు విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో ఏపీఎన్‌జీఓ సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్ రెడ్డి, శ్రీధర్‌బాబు, కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు శ్రీదేవి, సుజిత, త్రివేణి, పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది, ఏఐటీయూసీ రాజేష్, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, రామాంజినేయులు, సీపీఐ నాయకులు రమణ, శ్రీరాములు ఉన్నారు.

పిస్తా హౌస్ రెస్టారెంట్ ప్రారంభం



పిస్తా హౌస్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు అంజాద్ బాషా,రోజా, నటుడు అలీ, ఎమ్మెల్యే అనంత

అనంతపురం రూరల్: రుద్రంపేట సమీపంలో నేషనల్ హైవే పక్కన నూతనంగా ఏర్పాటైన పిస్తా హౌస్ బేకరీ అండ్ రెస్టారెంట్‌ను మంత్రి ఆర్‌కే రోజా, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, నటుడు మహమ్మద్ అలీతో కలిసి డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా శుక్రవారం ప్రారంభించారు. ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం, మంత్రి రోజా మాట్లాడుతూ దేశవిదేశాలతో పాటు ప్రముఖ నగరాల్లో ఏర్పాటు చేసే పిస్తా హౌస్ రెస్టారెంట్‌ను అనంతపురంలో ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం , డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతీ సాహితీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాలతో పంచాయతీ సాధారణ నిధులతో ఎస్సీ కాలనీలో మూడు కల్వర్టులు, 160 మీటర్ల సీసీ రోడ్డు, 200 మీటర్ల డ్రైనేజీ నిర్మించారు. పది రోజులుగా జరుగుతున్న పనులు శుక్రవారం పూర్తయ్యాయి. పనులు నాణ్యతగా జరిగేలా చర్యలు తీసుకున్నామని జేఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సర్పంచ్ లింగేశ్వరి మాట్లాడుతూ ఎమ్మెల్యే సూచనలతో పంచాయతీ పరిధిలో పలుచోట్ల సీసీ రోడ్లు, కాలువలు నిర్మించామన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిధులు, మండల నిధులు, పంచాయతీ నిధులతో పలు పనులు చేపట్టామన్నారు.



కల్వర్టు పనులు జరుగుతున్న దృశ్యం

అభాగ్యుడిని ఆదుకున్న 'అమ్మ'సంస్థ



ఆర్థిక సాయం అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: సనప గ్రామానికి చెందిన కిష్టయ్య కుటుంబాన్ని అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి ఆదుకున్నారు. శివమ్మ, కిష్టయ్య దంపతుల కుమారుడు విష్ణువర్ధన్ అనే బాలుడు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. బెంగళూరులో బైపాస్ సర్జరీ కూడా చేయించారు. వైద్యం కోసం ఉన్న ఎకరం పొలాన్ని కూడా విక్రయించారు. మెరుగైన వైద్యం చేయించే స్థోమత లేకపోయింది. ఆపన్న హస్తాల కోసం ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న అమ్మ రమణారెడ్డి శుక్రవారం తక్షణ సాయంగా రూ.15వేల నగదు, ఖరీదైన ప్రొటీన్ ఆహారం అందించారు. వైద్య పరీక్షలకు బెంగళూరుకు వెళ్లేందుకు వాహనం ఏర్పాటు చేశారు. రమణారెడ్డి మాట్లాడుతూ విష్ణువర్ధన్ వైద్య ఖర్చులకు ప్రతి నెలా రూ.20 వేలు అవసరమవుతుందని, మరింత మంది దాతలు స్పందించాలని కోరారు.

కమనీయం.. పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



మూడోరోడ్డులో పౌర్ణమి వేడుకలు

అనంతపురం కల్చరల్: వైశాఖ శుద్ధ పౌర్ణమి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో సాగాయి. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక వ్రతాలు జరిగాయి. పాతూరులోని ప్రాచీన విరూపాక్షేశ్వరాలయంలో రాత్రి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం, మహాశివునికి అభిషేకాలు, ఉత్సవ విగ్రహాల ఊంజల సేవ జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పౌర్ణమి వ్రతాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక అశోక్‌నగర్‌లోని శ్రీ రమా సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో, మూడో రోడ్డులోని శ్రీ షిర్డీసాయిబాబా మందిరం, శివకోటిలో శివయ్యస్వామి ఆధ్వర్యంలో లలితాకామేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు, సామూహిక సత్యదేవుని వ్రతాలు జరిగాయి.



పాతూరులో విరూపాక్షేశ్వరాలయంలో కల్యాణోత్సవ దృశ్యం

స్థానిక వనరులు పెంచుకోవాలి

• సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: పంచాయతీల్లో స్థానిక వనరులు పెంచుకొని అభివృద్ధికి బాటలు వేసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్రలో లేని విధంగా అనంతపురం రూరల్ మండలంలో పేదలకు ఉచితంగా ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. 30 ఏళ్లుగా చేయని అభివృద్ధి పనులు ప్రస్తుతం జరుగుతున్నాయన్నారు. కక్కలపల్లికాలనీ, పాపంపేట, అక్కంపల్లి, కురుగుంట, రాచానపల్లి తదితర పంచాయతీల్లో తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపుతున్నామన్నారు. మండల వ్యాప్తంగా 30 కిలో మీటర్ల సిమెంటు రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు.

ఇళ్ల బిల్లుల చెల్లింపులు ఆలస్యం చేయొద్దు ..

పేదలు నిర్మించుకుంటున్న ఇళ్ల బిల్లుల చెల్లింపుల్లో అలసత్వం చేయొద్దని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. పెట్టిన బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేసి మంజూరయ్యేలా చూడాలన్నారు. ఆదాయం తక్కువ ఉన్న పంచాయతీల్లో ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకోసం మండల గ్రాంటు, జెడ్పీ గ్రాంటు కేటాయించేలా చూస్తానన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఏ ఒక్క పంచాయతీలోనూ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ లేఔట్లు, ఫేక్ పట్టాలతో దక్కించుకున్న భూములు, ఇళ్ల స్థలాలను వెంటనే నోటీసులు జారీ చేసి వెనక్కు తీసుకోవాలన్నారు. మండలంలో దాదాపు 3,600 మంది నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఫేక్ పట్టాలను రద్దు చేసి ఆ భూములను పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, రాప్తాడు మార్కెట్‌యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, ఎంపీడీఓ బాబా ఫకృద్దీన్, తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఎంఈఓ వెంకటస్వామి, ఇతర అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రెజ్లర్లకు సంఘీభావం

అనంతపురం: దేశ రాజధానిలో నిరసన తెలుపుతున్న రెజ్లర్లకు సంఘీభావంగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఐసా (ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడు వేమన, అనంతపురం జిల్లా నాయకుడు మంజునాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై పోరాడిన మహిళా రెజ్లర్లపై అర్ధరాత్రి సమయంలో ఢిల్లీ పోలీసులు దాడులకు దిగడం సరికాదన్నారు. ప్రస్తుత రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ బ్రిజ్ భూషణ్ తన ఎంపీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రేపు గాయనీ గాయకుల ఎంపిక

అనంతపురం కల్చరల్: అనంత సింగర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు 'అనంత సూపర్ సింగర్ – 2023' పేరుతో నిర్వహిస్తున్న పోటీల్లో గాయనీగాయకుల ఎంపిక జరుగుతుందని నిర్వాహకులు రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో జరిగే పాటల పోటీల్లో ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని, వివరాలకు సెల్: 9290200675లో సంప్రదించాలన్నారు.

వివాహిత మిస్సింగ్ కేసు నమోదు

కనగానపల్లి: కనగానపల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం వివాహిత మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. యలకుంట్లకు చెందిన వెంకటేష్ భార్య స్వర్ణ గురువారం రాత్రి నుంచి కనిపించకుండా పోయింది. ఆమె కోసం చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎక్కడ వెతికినా కనిపించకపోవటంతో, వారి కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె: ఆర్డీటీ సెట్(2023)కు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఏటీఎల్ నాగరాజు శుక్రవారం తెలిపారు. పదో తరగతి స్టేట్ సిలబస్‌లో 500 మార్కులపైన, సీబీఎస్ సిలబస్‌లో 420 మార్కులు వచ్చిన విద్యార్థులు ఆర్డీటీ సెట్‌కు అర్హులన్నారు.

బుద్ధుని బోధనలు మానవాళికి మార్గదర్శనం



బుద్ధుడి విగ్రహం వద్ద నీరాజనాలర్పిస్తున్న బౌద్ధ అనుయాయులు

అనంతపురం కల్చరల్: బుద్ధుడు చూపిన మార్గం, ఆయన బోధనలు మానవాళికి మార్గదర్శనమని మహాబోధి సాహిత్య వేదిక వ్యవస్థాపకుడు దాసగాని కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం బుద్ధ జయంతి సందర్భంగా స్థానిక బుద్ధ విహార్ పార్కులో జ్ఞానదీపాలు వెలిగించి, ఆయన జీవితాన్ని మననం చేసుకున్నారు. బుద్ధిస్ట్ బాలకొండన్న త్రిరత్నాలు, పంచశీల పఠనం చేశారు. వారు మాట్లాడుతూ శుద్ధ వైశాఖ పౌర్ణమి రోజునే బుద్ధుడి జీవితం మరో మార్గం తిరిగిందని, ప్రపంచానికి సరికొత్త అధ్యాయం మొదలైందన్నారు. బౌద్ధ ధ్యానగురువు డాక్టర్ శివసాయి ప్రసాద్ సామూహిక ధ్యానం చేయించారు. కార్యక్రమంలో బౌద్ధ మత అనుయాయులు మిద్దె రవీంద్ర, పుల్లన్న, ఎంఎస్ రామాంజనేయులు, నాగప్పగారి ఆనందరాజు, తిరుపాలు, రమేష్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

రాప్తాడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాల్మన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులందరూ హాజరుకావాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

అనంతపురం క్రైం: కళ్యాణదుర్గం కొత్తూరు గ్రామానికి చెందిన మంజునాథ్ అనే వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.90 వేలు చెక్కును తన క్యాంపు కార్యాలయంలో ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మంజునాథ్, అతని తల్లి పేట లక్ష్మీదేవి ఎంపీ తలారి రంగయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కొనసాగిన బండిశిల తిరునాల



బండిశిల రథాన్ని లాగుతున్న దృశ్యం

పామిడి: రామరాజుపల్లిలో శుక్రవారం మూడోరోజు బండిశిల తిరునాలను సాగింది. గుత్తి అనంతపురం నుంచి కాశేపల్లి మీదుగా బండిశిల రథం గురువారం అర్ధరాత్రి దాటాక తిరిగి రామరాజుపల్లికి చేరింది. ఈసందర్భంగా సుంకులమ్మ, ముత్యాలయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం బండిశిల రథాన్ని గుత్తి అనంతపురం వైపునకు ఏడుగాండ్ల వృషభాలతో లాగించారు.

2023-24లో ఎంటెక్ స్ట్రక్చరల్



మాట్లాడుతున్న వీసీ రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహిస్తున్న ఎంటెక్ (స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ -బ్రిడ్జి అండ్ టన్నెల్స్)కోర్సును 2023-24 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి తెస్తున్నట్లు వీసీ జింకా రంగజనార్దన తెలిపారు. ఈ మేరకు భారత ప్రభుత్వ రోడ్లు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ అధికారులు వర్సిటీ ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించారు. ఏపీ పీజీఈసెట్-2023 ద్వారా ఎంటెక్ అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. ఎంటెక్ కోర్సులో అడ్మిషన్ పొందే విద్యార్థులకు భారత ప్రభుత్వ రోడ్లు, రవాణా, మంత్రిత్వశాఖ ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రూ.1.75 కోట్లు రీసెర్చ్ ప్రాజెక్ట్ మంజూరైంది. భారత ప్రభుత్వ రోడ్లు,రహదారుల మంత్రిత్వశాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సారంగి, డైరెక్టర్ బిదుర్ కాంత్ , జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ సి. శశిధర్, ప్రిన్సిపాల్ పి. సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ఆర్ .భవానీ, స్పెషల్ ఆఫీసర్ పీఆర్ భానుమూర్తి పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

అనంతపురం క్రైం: శ్రీ పొట్టి శ్రీరాములు స్కూల్‌లో నిర్మాణదశలో ఉన్న గదులను నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
695	187
61,054	18,069

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	12,210	△ 224
డోజోన్స్	33,580	△ 453
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,778	△ 76
డాక్స్	15,961	△ 227
షాంఘై	3,334	▽ 16
నికాయ్	29,158	△ 35

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో ముంబై	
బంగారం (99.9 గ్రాములు)	
61,923	△ 277
బంగారం (99.5 గ్రాములు)	
61,979	△ 279
వెండి (కిలో)	
76,794	△ 330

ఒలెక్ట్రా ఆదాయం రూ. 376 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ. 376 కోట్ల ఆదాయం (కన్సాలిడేటెడ్)పై రూ. 27 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో ఆదాయం రూ. 271 కోట్లుగా, లాభం రూ. 18 కోట్లుగా నమోదైంది. ఇక పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం 84 శాతం ఎగసి రూ. 594 కోట్ల నుంచి రూ. 1,091 కోట్లకు చేరింది. నికర లాభం 86 శాతం వృద్ధితో రూ. 35 కోట్ల నుంచి రూ. 66 కోట్లకు పెరిగింది. 2021–22లో 259 ఎలక్ట్రిక్ బస్సులు డెలివరీ చేయగా, 2022–23లో 117 శాతం అధికంగా 563 ఈ–బస్సులను అందించినట్లు సంస్థ తెలిపింది. మొత్తం 3,394 బస్సుల కోసం ఆర్డర్లు ఉన్నట్లు వివరించింది. ఎలక్ట్రిక్ టిప్పర్లను కూడా విక్రయించడం ప్రారంభించామని, క్యూ4లో 17 వాహనాలను డెలివరీ చేశామని పేర్కొంది. సరఫరా వ్యవస్థ, స్థూల పరిస్థితులపరమైన రిస్కులు నెలకొన్నప్పటికీ తాము తయారీ, సాంకేతిక సామర్థ్యాలను పెంచుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సీఎండీ కె.వి. ప్రదీప్ తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల విభాగంలో అగ్రగామిగా కొనసాగేందుకు ఇది తోడ్పడుతోందని ఆయన పేర్కొన్నారు.

పతంజలి 'వెయిట్‌గో' తో సత్ఫలితాలు

హైదరాబాద్: బరువు తగ్గించడంలో తాము అభివృద్ధి చేసిన 'దివ్య వెయిట్‌గో' సత్ఫలితాలను ఇస్తున్నట్లు పతంజలి రీసెర్చ్ ఫౌండేషన్ తెలిపింది. తేలిక పాటి వ్యాయామాలు చేస్తూ, ఈ ఆయుర్వేదిక్ ఔషధాన్ని వినియోగిస్తే శరీరంలోని కొలెస్ట్రాల్, గ్లూకోజ్, ఇన్సులిన్‌లను తగిన స్థాయిల్లో ఉండేలా చేస్తుందని ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ జర్నల్ 'బయోమెడిషన్ అండ్ ఫార్మాకో థెరపీ'లో ఈ ఔషధం పనితీరు గురించి ప్రచురితమైనట్లు వివరించింది.



మనీ లాండరింగ్ పరిధిలోకి సీఏలు

- పీఎంఎల్‌ఏ కిందికి కాస్ట్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు
- అయిదు రకాల ఆర్థిక లావాదేవీలకు వర్తింపు
- కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్

న్యూఢిల్లీ: నల్ల ధనం చలామణీ, మనీ లాండరింగ్ కార్యకలాపాలను నిరోధించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన కేంద్రం ఆ దిశగా మరో కీలక చర్య తీసుకుంది. బ్లాక్ మనీ చలామణీకి ఆస్కారం ఉండే అయిదు రకాల ఆర్థిక లావాదేవీలను, వాటిని క్లయింట్ల తరఫున నిర్వహించే చార్టర్డ్ అకౌంటెంట్లు, కాస్ట్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలను మనీ–లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) పరిధిలోకి చేర్చింది. దీంతో ఇకపై సదరు లావాదేవీలను నిర్వహించే సీఏలు, సీఎస్‌లు కూడా విచారణ ఎదుర్కొనాల్సి రానుంది. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ మే 3న నోటిఫికేషన్ విడుదల చేసింది. స్థిరాస్తుల కొనుగోలు, విక్రయం; క్లయింట్ల డబ్బు, సెక్యూరిటీలు లేదా ఇతర ఆస్తుల నిర్వహణ; బ్యాంక్, సేవింగ్స్ లేదా సెక్యూరిటీస్ అకౌంట్ల నిర్వహణ; కంపెనీల ఏర్పాటు, నిర్వహణ కోసం నిధులు సమీకరించడంలో తోడ్పాటు; వ్యాపార సంస్థల కొనుగోళ్లు, విక్రయం.. మొదలైన అయిదు రకాల ఆర్థిక లావాదేవీలు ఇందులో ఉన్నాయి. పీఎంఎల్‌ఏ చట్టం 2002ను ప్రయోగించాల్సి వస్తే క్లయింట్ల స్థాయిలోనే సీఏలు కూడా జరిమానా, విచారణ ఎదుర్కొనాల్సి వస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 'పీఎంఎల్‌ఏ నిబంధనలను అమలు చేస్తే క్లయింట్లతో సమానంగా సీఏలు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా లావాదేవీ జరిగినట్లుగా భావిస్తే ఆ విషయాన్ని సీఏలు వెంటనే నియంత్రణా సంస్థకు తెలియజేయాలి' అని వివరించాయి.

రిపోర్టింగ్ అధికారులుగా సీఏలు..

ఆయా లావాదేవీల విషయంలో సీఏలు ఇకపై నియంత్రణ సంస్థలకు తెలియజేయాల్సిన రిపోర్టింగ్ అధికారులుగా వ్యవహరించాల్సి ఉంటుందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) పేర్కొంది. సదరు లావాదేవీలు నిర్వహించే క్లయింట్లందరి వివరాలను సేకరించి (కేవైసీ), రికార్డులను నిర్వహించాల్సిన బాధ్యత వారిపై ఉంటుందని తెలిపింది. క్లయింట్ల తరఫున ఏయే ఆర్థిక లావాదేవీలు జరపకుండా నిషేధం ఉందనే దాని గురించి తమ సభ్యుల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఐసీఏఐ వివరించింది. కొత్త మార్పులు సరైన కోణంలో అమలయ్యేలా చూసేందుకు, వృత్తి నిపుణులు పోషించగలిగే పాత్ర అర్థమయ్యేలా వివరించేందుకు నియంత్రణ సంస్థలు, అధికారులతో కలిసి పనిచేయనున్నట్లు ఐసీఏఐ తెలిపింది. నల్ల ధనం కట్టడికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల పీఎంఎల్‌ఏ నిబంధనలను కఠినతరం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు .. రాజకీయాలతో ప్రమేయమున్న వ్యక్తుల (పీఈపీ) ఆర్థిక లావాదేవీలను రికార్డు చేయడాన్ని తప్పనిసరి చేసింది. అలాగే లాభాపేక్ష రహిత సంస్థల ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని కూడా ఆర్థిక సంస్థలు, రిపోర్టింగ్ ఏజెన్సీలు సేకరించాల్సి ఉంటోంది. ఇక వర్చువల్ అసెట్స్ లావాదేవీలు నిర్వహించే క్రిప్టో ఎక్స్ఛేంజీలు, మధ్యవర్తిత్వ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించే యూజర్ల వివరాలను సేకరించడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది.



ఫెడరల్ బ్యాంక్ లాభం హైజంప్

క్యూ4లో రూ. 954 కోట్లు

ముంబై: ప్రైవేట్ రంగ సంస్థ ఫెడరల్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 954 కోట్ల నికర లాభం ఆర్జించింది. 62 శాతం ఎగసింది. ఇది ఒక త్రైమాసికానికి బ్యాంక్ చరిత్రలోనే అత్యధికం కాగా.. ఇందుకు పెట్టుబడుల విక్రయ లాభాలు దోహదపడినట్లు బ్యాంక్ పేర్కొంది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 61 శాతం ఎగసి రూ. 3,165 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2021–22) రూ. 1,970 కోట్లు మాత్రమే ఆర్జించింది. కాగా.. క్యూ4లో నికర వడ్డీ ఆదాయం 25 శాతం పుంజుకుని రూ. 1,909 కోట్లను అధిగమించింది. ఇతర ఆదాయం 58 శాతం ఎగసి రూ. 734 కోట్లను తాకింది. దీంతో రికార్డ్ లాభం ఆర్జించినట్లు బ్యాంక్ వెల్లడించింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.78 శాతం నుంచి 2.35 శాతానికి తగ్గాయి.



సూచీలకు హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షాక్..!

- వారాంతాన ఒక శాతం పతనమైన మార్కెట్
- సెన్సెక్స్ నష్టం 695 పాయింట్లు
- 18,100 దిగువకు నిఫ్టీ

ముంబై: ప్రైవేట్ రంగ దిగ్గజ కంపెనీలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ల ద్వయం 66% పతనంతో దేశీయ స్టాక్ సూచీలు శుక్రవారం భారీగా నష్టపోయాయి. విలీన ప్రక్రియ తర్వాత సుమారు 150 – 200 మిలియన్ డాలర్ల మేర అవుట్‌ఫ్లో ఉండొచ్చని ఎంఎస్‌సీఐ నివేదిక తెలపడంతో ఇరు కంపెనీల షేర్లు గడిచిన మూడేళ్లలో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. అలాగే అమెరికా బ్యాంకింగ్ సంక్షోభ భయాలు, వాల్ స్ట్రీట్ నుంచి బలహీన సంకేతాలు, ఈసీబీ పావుశాతం వడ్డీరేట్ల పెంపుతో పాటు వారాంతపు రోజు కావడంతో ట్రేడర్లు కీలక కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటం సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడిని పెంచాయి. సెన్సెక్స్ ఉదయం 586 పాయింట్ల నష్టంతో 61,163 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో కొనుగోళ్ల మద్దతు లభించకపోవడంతో ఒక దశలో 747 పాయింట్లు క్షీణించి 61,002 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 696 పాయింట్లు నష్టపోయి 61,054 వద్ద ముగిసింది. నిఫ్టీ 139 పాయింట్ల పతనంతో 18,117 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 18,217 – 18,055 పరిధిలో కదలాడింది. ఆఖరికి 187 పాయింట్లు నష్టపోయి 18,069 వద్ద నిలిచింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, మెటల్, మీడియా, ఐటీ రంగాల షేర్లకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్ల పతనంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.50%, 0.30% చొప్పున నష్టపోయాయి. కాగా ఆటో, ఎఫ్‌ఎంసీజీ, కన్జూమర్ డ్యూరబుల్స్, క్యాపిటల్ గూడ్స్ రంగాల షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగానూ, యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి. బీఎస్‌ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.43 లక్షల కోట్లు హరించుకుపోయింది.

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 5.63% పతనంతో రూ.1625 వద్ద నిలిచింది. బ్యాంక్ రూ.56,228 కోట్ల మార్కెట్ క్యాప్ కోల్పోయింది. హెచ్‌డీఎఫ్‌సీ 5.84% నష్టంతో రూ.1625 వద్ద క్లోజైంది. రూ.29,572 కోట్ల మార్కెట్ క్యాప్ ఆవిరైంది.



బంగారం డిమాండ్‌కు ధర సెగ

- భారత్ వినియోగదారుల కొనుగోళ్లు వాయిదా
- జనవరి–మార్చిలో డిమాండ్ 17 శాతం డౌన్
- ప్రపంచ స్వర్ణ మండలి నివేదిక

ముంబై: దేశంలో బంగారం ధరలు తీవ్ర స్థాయికి చేరడంతో, జనవరి–మార్చి త్రైమాసికంలో డిమాండ్ భారీగా 17 శాతం పడిపోయింది. వినియోగదారులు తీవ్ర ధరల కారణంగా కొనుగోళ్లను వాయిదా వేసుకునే పరిస్థితి నెలకొంది. 'మొదటి త్రైమాసికంలో పసిడి డిమాండ్ ట్రెండ్స్' పేరుతో ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) విడుదల చేసిన ఒక నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు...

- ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో భారత్ పసిడి డిమండ్ 112.5 టన్నులు. 2022 ఇదే కాలంలో ఈ విలువ 135.5 టన్నులు.
- పసిడి ఆభరణాల డిమాండ్ ఇదే కాలంలో 94.2 టన్నుల నుంచి 78 టన్నులకు పడిపోయింది. 2010 నుంచి ఒక్క మహమ్మారి కరోనా కాలాన్ని మినహాయిస్తే పసిడి ఆభరణాల డిమాండ్ మొదటి త్రైమాసికంలో 100 టన్నుల దిగువకు పడిపోవడం ఇది నాల్గవసారి.



- విలువల రూపంలో చూస్తే, మొత్తంగా పసిడి కొనుగోళ్లు 9 శాతం క్షీణించి రూ.61,540 కోట్ల నుంచి రూ.56,220 కోట్లకు పడిపోయాయి.
- ఒక్క ఆభరణాల డిమాండ్ విలువల్లో చూస్తే, 9 శాతం పడిపోయి రూ.42,800 కోట్ల నుంచి రూ.39,000 కోట్లకు పడిపోయాయి.
- పెట్టుబడుల పరిమాణం పరంగా డిమాండ్ (కడ్డీలు, నాణేలు) 17 శాతం తగ్గి 41.3 టన్నుల నుంచి 34.4 టన్నులకు క్షీణించింది.

ప్రపంచ పసిడి డిమాండ్ కూడా మైనస్సే..

ఇదిలావుండగా, ప్రపంచ వ్యాప్తంగా కూడా పసిడి డిమాండ్ మొదటి త్రైమాసికంలో బలహీనంగానే నమోదయ్యింది. 13 శాతం క్షీణతతో ఈ పరిమాణం 1,080.8 టన్నులుగా ఉంది.

రూపాయి ఎఫెక్ట్...



పసిడి ధరలు పెరడానికి అంతర్జాతీయ అంశాలు ప్రధాన కారణంగా కనబడుతున్నాయి. ముఖ్యంగా ఇక్కడ అమెరికా సెంట్రల్ బ్యాంక్– ఫెడ్ ఫండ్ రేటు పెరుగుదలను ప్రస్తావించుకోవాల్సి ఉంటుంది. డాలర్ బలోపేతం, రూపాయి బలహీనత వంటి కారణాలతో గత ఏడాదితో పోల్చితే పసిడి ధర 19 శాతం పెరిగింది. పసిడి 10 గ్రాముల (స్వచ్ఛత) ధర రూ.60,000 పైన నిలకడగా కొనసాగుతోంది. ధర తీవ్రతతో తప్పనిసరి పసిడి అవసరాలకు వినియోగదారులు తమ పాత ఆభరణాల రీసైక్లింగ్, తద్వారా కొత్త కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పెట్టుబడులకు సంబంధించి డిజిటల్ గోల్డ్ ప్లాట్‌ఫామ్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈ విభాగంలో కొనుగోళ్ల పరిమాణాలు కొంత మెరుగుపడుతున్నాయి. డిమాండ్ వార్షికంగా 750 నుంచి 800 టన్నులు శ్రేణిలో నమోదుకావచ్చు.

– సోమసుందరం, డబ్ల్యూజీసీ భారత్ రీజినల్ సీఈఓ.

మే ఎండలు మండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆరోగ్య నిపుణులు, అనుభవజ్ఞులు చెప్పిన చిట్కాలు...

• వడదెబ్బ జాగ్రత్త పడదాం ఇలా...



ఎండల ధాటికి వడదెబ్బ ప్రభావం శరీరంపై పడే అవకాశం ఉంది. శరీరంలో నీటిశాతం తగ్గితే, వడదెబ్బ తగులుతుంది. అందువల్ల వేసవిలో శరీరంలో నీటిశాతం తగ్గకుండా చూసుకోవాలి. ఇంకా ఎండల్లో ఎక్కువ తిరగకుండా ఉండాలి. అధికంగా ఎండలో తిరగటంతో రక్తకణాలు కుంచించుకు పోతాయి. దీనిమూలంగా కిడ్నీలు, లివర్ దెబ్బతింటాయి. అందువల్ల కొన్ని రకాల జాగ్రత్తలు పాటించడం అవసరం.

ఎలా గుర్తించాలి?

- చర్మం పొడిబారుతుంది. కళ్లు మంటలు రావడం, గుంజినట్లు అవడం జరుగుతుంది.
- శరీరంలో నీటి శాతం లోపిస్తుంది. శరీరం అదుపుతప్పుతుంది.
- నీరసంగా అనిపిస్తుంది. కొందరికి కళ్లు లాగుతాయి. తలనొప్పి వస్తుంది.
- వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు అవుతాయి.
- శరీర ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. జ్వరం వస్తుంది.
- దాహం ఎక్కువగా ఉంటుంది. తల తిరగడం, మతి కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికి ముప్పు ఏర్పడుతుంది.

ఎవరిపై ఎక్కువ ప్రభావం?

60 సంవత్సరాలు పైబడిన వారు, చిన్నారులు, క్రీడాకారులు, గర్భిణులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవాళ్లు, స్థూలకాయులు, మద్యం ఎక్కువగా తాగే వాళ్లు, అతిగా ఔషధాలు తీసుకొనేవారు జాగ్రత్తగా ఉండాలి. వేసవి లో ఎక్కువ సేపు ఎండలో పనిచేసే కూలీలు, కార్మికులు, ఉద్యోగులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి వారు చాలా జాగ్రత్తగా ఉండాలి.

ముందుజాగ్రత్తలు ఏమిటి?

- ప్రతిరోజు మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలి.
- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలకు క్యాప్ పెట్టుకోవాలి. గొడుగు తీసుకెళ్లాలి.
- రోజుకు ఐదారు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి.
- సమయానికి తగిన ఆహారం తీసుకోవాలి.
- ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలి.
- వదులైన కాటన్ దుస్తులు ధరించాలి.
- నూనె పదార్థాల వాడకం తగ్గించాలి.
- కొబ్బరి బోండాం, మజ్జిగ తాగండి.
- బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా సన్‌గ్లాసెస్ పెట్టుకోవాలి.
- అలాగే నీళ్ల బాటిల్ తీసుకెళ్లండి.
- మధ్యాహ్నం 12 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరగకూడదు.
- కీరదోస ముక్కల్ని ఎక్కువగా తినడంవల్ల శరీరానికి నీటితోపాటు పోషకాలు కూడా అందుతాయి. మలబద్ధక సమస్య కూడా తగ్గుతుంది.
- శరీరంలో నీటిశాతాన్ని పెంచే పుచ్చకాయ, కొబ్బరినీళ్లు తాగాలి.
- వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఉల్లిపాయను మెత్తగా నూరి శరీరానికి రాయాలి.
- జీలకర్ర దోరగా వేయించి పొడిచేయండి. అర స్పూన్ పొడిని గ్లాసు నిమ్మరసంలో కలిపి ఉప్పు, పంచదార వేసుకొని తాగితే శరీరానికి బోలెడంత ఎనర్జీ వస్తుంది.
- ఈ కాలంలో సలాడ్స్, తాజా కాయగూరలు, పండ్ల రసాలు తీసుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది.



వడదెబ్బ తగిలితే ఏం చేయాలి?

- నీరుల్లిపాయ రసం రెండు కణతలకు, ఛాతీమీద పూస్తే వడదెబ్బ తగలడం వలన కలిగిన బాధలు తగ్గుతాయి.
- వడదెబ్బ తగిలిన వారి ముఖం మీద, ఒంటిమీద నీళ్లు చల్లుతూ ఉండాలి. నిమ్మరసంలో ఉప్పు కలిపి ఇవ్వాలి.
- కుమ్మున ఉడికించిన మామిడికాయ రసంలో ఉప్పు, జీలకర్ర కలిపి తాగుతుంటే వడదెబ్బ తగలదు.
- శరీరం మీద ఉన్న దుస్తులను వదులు చేసి విశ్రాంతిగా పడుకోనివ్వాలి.
- గ్లాసు నీళ్లలో స్పూను తేనె కలిపి ఇస్తే ఉపహనం కలుగుతుంది.
- తరువాణి తేటలో ఉప్పును చేర్చి ఇవ్వాలి.
- లేత తాటిముంజలను పంచదారతో కలిపి తినిపించాలి.
- నాలుకకు పాత ఉసిరిక పచ్చడి రాసి పుల్లని మజ్జిగలో ఉప్పువేసి అన్నంలో పోసి పిసికి పిప్పిని పారవేసి ఆ రసాన్ని తాగించాలి.
- వేడివేడి పలచటి గంజిలో ఉప్పు వేసి తాగించాలి.
- బయటకు వెళ్లేటప్పుడు ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ కలిపిన నీరు లేదా ఓఆర్ఎస్ ద్రావణం తాగడం మంచిది.
- వీలయినంత వరకు ఎండవేళలో బయటికి వెళ్లకుండా ఉండటం ఉత్తమం. తప్పనిసరిగా వెళ్లవలసి వస్తే, గొడుగు వాడాలి లేదా కనీసం నెత్తిన టోపీ లేదా రుమాలు పెట్టుకుని ఉంటే కొంత ఉపశమనం కలుగుతుంది.

కర్బూజ పండంటి ఆరోగ్యం

వేసవిలో మనకు అధికంగా దొరికే పండు ఖర్బూజ పండు. ఈ పండులో అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. కర్బూజలో దాదాపు తొంభై శాతం నీరు ఉంటుంది. కాబట్టి వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి, వేసవిలో శరీరం కోల్పోయే నీటిని తిరిగి అందించడంలో కర్బూజపండు బాగా ఉపయోగపడుతుంది. ఈ పండు ముఖ్యంగా శరీరంలోని వేడిని తగ్గిస్తుంది. అధిక రక్తపోటుని తగ్గిస్తుంది. ఈ పండులో ఉన్న పోషక విలువలేంటో తెలుసుకుందాం.



- కర్బూజ పండులో ఎక్కువ శాతంగా ఉండే బీటాకెరోటిన్, విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు శరీరంలోని తెల్ల రక్తకణాలను వృద్ధి చెందేలా చేసి రక్తంలో ఇన్ఫెక్షన్స్ రాకుండా కాపాడతాయి.
- కర్బూజలో విటమిన్ ఎ ఎక్కువగా ఉండటం వల్ల కంటి సంబంధిత సమస్యలను దూరం చేసి కంటిచూపు బాగా ఉండేలా చేస్తుంది. వడదెబ్బ నుండి రక్షిస్తుంది.
- కర్బూజ పండులో విటమిన్ కె, విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. దీనివలన ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. అంతేకాకుండా రక్త ప్రసరణ చక్కగా పని చేసేలా ఉపయోగపడుతుంది.
- ఈ పండులో అధిక మోతాదులో పొటాషియం ఉండటం వలన గుండెకు మంచి న్యూట్రియన్స్‌ని అందజేస్తుంది. దీనిలో ఫోలెట్ ఉండటం వలన అది హార్ట్ ఎటాక్ నుండి, గుండె జబ్బుల నుండి కాపాడుతుంది.
- తక్కువ క్యాలరీస్, ఎక్కువ పీచు పదార్థం ఉండటం వలన అధిక బరువుని తగ్గిస్తుంది.
- ఖర్బూజ జ్యూస్ తాగడం వలన మెదడుకి ఆక్సిజన్ సరఫరా బాగా జరిగి, ఒత్తిడి తగ్గి నిద్ర బాగా పడుతుంది. ఈ జ్యూస్‌ని క్రమం తప్పకుండా సేవిస్తే రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది.
- ఈ పండు కిడ్నీలో రాళ్లను సైతం కరిగిస్తుంది. జీర్ణ శక్తిని మెరుగుపరుస్తుంది.
- ఫోలిక్ యాసిడ్ సమృద్ధిగా ఉండడం గర్భిణులకు ఎంతో మేలు చేస్తుంది. బిడ్డ ఎదుగుదలకు తోడ్పడుతుంది.
- కంటి ఆరోగ్యం, శ్లేష్మాన్ని తగ్గించడానికి కర్బూజా సహాయపడుతుంది. వేసవిలో కర్బూజ పండు ముక్కలతోపాటు జ్యూస్ తాగటం వల్ల మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చు.

వ్యాధులనుంచి కాపాడుకుందాం

పోయిందనుకున్న కోవిడ్ ఇప్పుడు మళ్లీ ప్రభావం చూపిస్తోంది. కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే భయ పడాల్సిందేమీ లేదు. ఎందుకంటే రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటే ఒక్క కరోనానే కాదు, ఎన్నో అంటువ్యాధులు, ఇతర రోగాలు వచ్చే అవకాశం ఉంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి ఏం చేయాలో తెలుసుకుందాం.



ఆరోగ్యకరమైన ఆహారం మనల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. పండ్లు, కూరగాయల్లో విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. ఈ ఆహారాలు రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. మాంసం, బీన్స్ వంటి ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీర పనితీరును మెరుగుపరుస్తాయి. పసుపు, అల్లం, నిమ్మరసం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. అందువల్ల ఆహారంలో అవి ఉండేలా చూసుకోవడం మంచిది.

వ్యాయామం

క్రమం తప్పకుండా చేసే ఏ తేలికపాటి వ్యాయామం అయినా సరే,రోగనిరోధకతను పెంచుతుంది. అందువల్ల ఏమీ చేయలేకపోయినా, కనీసం నడవడం వల్ల అయినా శరీరమంతటికీ రక్తప్రసరణ పెరుగుతుంది. అన్ని కణాలకూ ఆక్సిజన్ అందుతుంది. ఒత్తిడి తగ్గుతుంది.

ఒత్తిడి లేకుండా చూసుకోవాలి

ఒత్తిడి రోగనిరోధక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది మన శరీరంలో కార్టిసాల్ ఉత్పత్తిని పెంచుతుంది. ఇది రోగనిరోధక ప్రతిస్పందనను నెమ్మదింపజేస్తుంది. ధ్యానం, లోతైన శ్వాస వ్యాయామాలు, యోగా వంటివి ఒత్తిడిని తగ్గించడానికి, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి సహాయపడతాయి.

ద్రవపదార్థాలు

మంచి ఆరోగ్యానికి, బలమైన రోగనిరోధక వ్యవస్థ బలంగా ఉండేందుకు శరీరం హైడ్రేటెడ్‌గా ఉండటం చాలా ముఖ్యం. నీరు శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడానికి సహాయపడుతుంది. రోగనిరోధక వ్యవస్థ సమర్థంగా పనిచేయడానికి నీరు ఎంతో సహాయపడుతుంది.

సరిపడా నిద్ర

ఆరోగ్యం బాగుండాలంటే తగినంత నిద్ర చాలా అవసరం. నిద్ర లేకపోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గడంతో పాటుగా ఎన్నోరకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. తక్కువ నిద్ర పోయేవారికి తొందరగా జలుబు లేదా ఫ్లూ వచ్చే అవకాశం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. సామాజిక దూరాన్ని, శుచి, శుభ్రతలను పాటిస్తూ ఉండటం, జనసమూహంలోకి వెళ్లినప్పుడు మాస్కులు వేసుకోవడం అవసరం. ఈ విధమైన జాగ్రత్తలు తీసుకుంటే కోవిడ్ ఒక్కటే కాదు, ఇతర ఆరోగ్య సమస్యలు కూడా తొందరగా దరిచేరవు.